క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి



గవర్నర్ అబ్దుల్‌నజీర్‌తో ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: విజయవాడలోని రాజ్‌భవన్‌లో బుధవారం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్‌ను ఎమ్మెల్యే తిప్పేస్వామి కలిశారు. అమరాపురం మండలంలోని హేమావతి సిద్దేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించాలని గవర్నర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. తప్పకుండా ఆలయాన్ని సందర్శిస్తానని గవర్నర్ చెప్పారన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే తనయుడు దినేష్, కోడలు ప్రవీణలక్ష్మి కూడా ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మడకశిర: మండలంలోని ఆమిదాలగొంది వద్ద బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. సెబ్ అధికారులు కలిసి ట్రాక్టర్ పట్టుకున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రొళ్ల: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దొమ్మరహట్టి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, నులిపురుగు నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మైలారప్ప, ఎంపీహెచ్ఈఓ ఖదర్ వలీ, పీహెచ్ఎన్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పావగడ: తాలూకాలోని నెనగానహళ్లి గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు దుగ్గమ్మ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు సుమారు 80 మంది లబ్ధిదారులకు స్త్రైచర్లు, సోలార్ దీపాలు, చేతి కర్రలు, వాటర్ బెడ్లు పంపిణీ చేశారు.

4.12 మెట్రిక్ టన్నుల ఎరువుల సీజ్



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

చిలమత్తూరు: మండలంలోని ఎరువుల దుకాణాలను కదిరి డివిజన్ ఏడీఏ సత్యనారాయణ ఏఓ వంశీకృష్ణతో కలసి తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. కోడూరు తోపులోని ఎరువుల దుకాణంలో రూ.37,100 విలువ చేసే 4.12 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు.. రైతులకు అవసరమైన మేరకు మాత్రమే వాటిని విక్రయించాలని బ్లాక్‌లో అమ్మకాలు చేస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని శ్రీమారుతీ ఏజెన్సీ, శ్రీభాగ్యలక్ష్మి ఎరువుల దుకాణాలను కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ బుధవారం తనిఖీ చేశారు. బిల్ పుస్తకాలు, ఇన్వాయిస్, లైసెన్సులను పరిశీలించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

మడకశిర: పట్టణంలో బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించి ముగ్గురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. వారి నుంచి రూ.38,505 నగదుతో పాటు మట్కా చీటీలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

గుడిబండ: మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో వైఎస్సార్ పట్టుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ ఇబ్రహీం మల్బరీలో తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు, సలహాలిచ్చారు.

సందడిగా అథ్లెటిక్స్



పరుగు పోటీని ప్రారంభిస్తున్న సీఐ సుబ్బరాయుడు

గోరంట్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం గోరంట్ల , అమడగురు మండలాల్లోని ఆరు పాఠశాలలకు చెందిన బాలికలకు అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీఐ సుబ్బరాయుడు ప్రారంభించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేశారు.

వేడుకగా నా భూమి - నా దేశం



మడకశిర: స్వాతంత్య్ర సమరయోధుడు గోవిందరెడ్డిని సన్మానించిన దృశ్యం



చిలమత్తూరు: మట్టి ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న దృశ్యం



గోరంట్ల: మొక్కలు నాటుతున్న అధికారులు

అగళి: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి - నా దేశం , నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అగళి మండల పరిధిలోని ఆగళి, నరసంబుది, రామన్నపల్లి, ఇరిగెపల్లి గ్రామ పంచాయతీలో కేంద్రాల్లో దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. ఏఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ పద్మవతి, ఏపీఓ శివన్న, ఎంఈఓ 2 చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని మండంలోని గుట్టూరు, వెంకటగిరిపాళ్యం గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో బుధవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ శివశంకరప్ప, తహసీల్దార్ స్వర్ణలత, ఈఓఆర్డీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీరాములు పాల్గొన్నారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకం చేపట్టి పర్యావరణాన్ని రక్షించుకుందామని ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఏఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రొళ్ల, హొట్టేబెట్ట, హులీకుంట పంచాయతీ కేంద్రాల్లో నా భూమి-నా దేశంలో భాగంగా మొక్కలు నాటారు. సర్పంచులు ప్రకాష్, రామలక్ష్మమ్మ, కరియమ్మ, ప్రిన్సిపాల్ మైలారప్ప పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని పి.సి.గిరి, కే.ఎన్.పల్లి, మద్దనకుంట, మందలప్లి ఉన్నత పాఠశాలల్లో నా దేశం నాభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఎంపీడీఓ రామారావు, ఎంఈఓ రవిచంద్రకుమార్, జెడ్పీటీసీ భూతరాజు, సర్పంచులు యంజారేగౌడు, అశ్వథ్, లక్ష్మిదేవి, జగదాంబ, ఏపీఓ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా మడకశిర మండలంలోని 16 గ్రామ పంచాయితీల కేంద్రాల్లో బుధవారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి నా భూమి- మా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో శిలాఫలాకాలను ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటి నీరు పోశారు. మెళవాయిలో స్వాతంత్య్ర సమర యోధుడు, న్యాయవాది గోవిందరెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సత్యనారాయణరావును సన్మానించారు. కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ సదాశివరెడ్డి, అధ్యాపకులు నాగరాజు, తహసీల్దార్ ముర్షావలి, ఎంపీడీఓ సోనిబాయి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని గంగంపల్లి సచివాలయం వద్ద బుధవారం నాభూమి - నా దేశం కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధులు, అమరవీరులు, సైనికులు చేసిన త్యాగలను స్మరించుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటారు. ఎంపీడీఓ రఘునాథగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని గొడనకుంట, మద్దనకుంట, అమరాపురం గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం నాదేశం- నాభూమి కార్యక్రమాన్ని టీం అధికారులు గోపాల్, ఏఓ భాస్కర్, ఈఓఆర్డీ భాస్కర్ల ఆధ్వర్యంలో ప్రారంభించారధ్వీ సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో నా దేశం-నా భూమి కార్యక్రమాన్ని అధికారులు బుధవారం ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన జవాన్ హనుమతు అమరుడు కావడంతో ఆయన తల్లిదండ్రులను సన్మానించారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ , ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రూప, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జె మారుతిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం, బిసలమానేపల్లి, మానేపల్లి గ్రామాల్లో నా భూమి-నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహనాయుడుతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలను నాటారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మధుసుధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: దేశ సేవకులను ఆదర్శంగా తీసుకోవాలని అటవీశాఖ ఎఫ్ఎస్ఓ శామీర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో బుధవారం నా భూమి - నాదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి మొక్కలు నాటారు.

చిలమత్తూరు: దేమకేతేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నా భూమి - నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ తిరుమలేష్ ఆధ్వర్యంలో నేలతల్లికి నమస్కారం - వీరులకి వందనం స్థూపాన్ని ప్రారంభించి మట్టి ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ నిర్వహించారు.

పరిగి: డెబ్బై ఐదేళ్ల స్వాతంత్య్ర భారతావనిని కాపాడుకోవాలని, స్వాతంత్ర సమరంలో అశువులు బాసిన దేశనాయకుల పోరాట పటిమను భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో బాగంగా నిర్వహిస్తున్న నాభూమి నాదేశం కార్యక్రమాలు బుధవారం పరిగి మండలంలో ప్రారంభమయ్యాయి.

పరిగి మండల కేంద్రంతో పాటు కొడిగెనహళ్లిలో జరిగిన నాభూమి నాదేశం కార్యక్రమాలను తహసీల్దారు సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో స్పెషలాఫీసర్ ప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి సతీమణి శాంతమ్మ, కుమారుడు కేటీ శ్రీధర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీస్వామి, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, శ్రీరామప్ప, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



పెనుకొండలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

- ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: నవరత్నాలతో ప్రతి కుటుంబంలో సంతోషం నెలకొందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని 15, 16వ వార్డుల్లోని జీవీసీ కాలనీ, వజ్రాలపేటలో కౌన్సిలర్ రఘునాథరెడ్డి ఇతర నాయకుల ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మతో కలసి గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతం అమలు చేసి ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు దీవించి మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు అందించడానికి ముఖ్యమంత్రి కంకణబద్ధుడై ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు రోడ్లు, డ్రైనేజీలు వేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహ, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ సభ్యుడు గుట్టూరు శ్రీరాములు, ముఖ్యనాయకులు మాజీ ఎంపీటీసీ రామ్మోహన్‌రెడ్డి, వైశాలి జయశంకరరెడ్డి, గుట్టూరు ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు తయూబ్, భాస్కర్‌నాయక్, బోయ బాబు, చర్చి పాస్టర్ గోపాలరెడ్డి పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు



ఆర్టీసీ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సమన్వయకర్త దీపిక

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: మున్సిపాల్టీలోని అన్నివార్డుల్లో దశల వారీగా అభివృద్ధి పనులన్నీ చేపడతామని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. బుధవారం మున్సిపాల్టీ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆర్టీసీ కాలనీలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆమె భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. వార్డుల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులన్నీ దశల వారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజల వద్దకు ఇంటింటికీ నేరుగా వెళ్లి మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మున్సిపల్ వైస్‌చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, నాగేంద్రబాబు, చంద్రశేఖర్, షాజియా, పార్వతీ, నాగేంద్రమ్మ, సునీత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపేంద్రరెడ్డిని గెలిపించండి

హిందూపురం: చలివెందల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికల్లో ఉపేంద్రరెడ్డిని వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్నట్లు హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక తెలిపారు. ఆయనను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బుధవారం చలివెందల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఉపేంద్రరెడ్డి తల్లి సౌభాగమ్మ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలోనే అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందారన్నారు. సౌభాగ్యమ్మ అకాల మరణం మనకు తీరనిలోటన్నారు. వారి కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలవాలన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

దీపికకు కృతజ్ఞతలు తెలిపిన రవీంద్రుడు

హిందూపురం: కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ డైరెక్టర్‌గా తన ఎంపిక కృషి చేసిన మంత్రులు కొట్టు సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ రెడ్డీశ్వర్‌రెడ్డి, నియోజవకవర్గ సమన్వయకర్త దీపికకు రవీంద్రుడు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగానే బుధవారం దీపికకు పుష్పగుచ్ఛాలు అందించి ధన్యవాదలు తెలిపారు.

నామినేషన్ల సందడి

అమరాపురం: మండల పరిధిలోని నిడ్రఘట్ట గ్రామ పంచాయతీ పరిధిలో నాల్గవ వార్డు మెంబర్ స్థానానికి బుధవారం రెండు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నిల రిటర్నింగ్ అధికారి భాస్కర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యార్థి తిప్పమ్మ నామినేషన్ దాఖలు చేశారు.అలాగే అదే స్థానానికి కెంచమ్మ నామినేషన్ దాఖలు చేశారన్నారు.

సోమందేపల్లి: మండలంలోని మూడు వార్డులకు జరగనున్న ఉప ఎన్నికలకు సంబంధించి బుధవారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బ్రాహ్మణపల్లి మూడో వార్డుకు సుజాత, మండ్లి 9వ వార్డుకు లీలావతి, బ్రహ్మ సముద్రం 2వ వార్డుకు కంబాలప్ప, రమణ నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు ఏఆర్ఓ నాగరాజురావు తెలిపారు.

పరిగి: మండలంలోని హొన్నంపల్లి పంచాయతీ పరిధిలో జరిగే పంచాయతీ 10వ వార్డు మెంబరు ఉప ఎన్నికకు వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న హనుమయ్య నామినేషన్‌ను దాఖలు చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నామినేషన్ పత్రాలను ఎంపీడీఓ సరస్వతి సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ నటరాజ్‌కు అందించారు.



పరిగి: రిటర్నింగ్ ఆఫీసర్ నటరాజ్‌కు నామినేషన్ పత్రాలను అందిస్తున్న అభ్యర్థి హనుమయ్య

హిందూపురం అర్బన్: హిందూపురం రూరల్ మండలంలోని చలివెందల సర్పంచ్ ఉప ఎన్నికల సందర్భంగా బుధవారం సర్పంచ్ స్థానానికి టీడీపీ మద్దతుదారుడు నామినేషన్ దాఖలు చేసినట్లు ఈఓఆర్డీ నటరాజ్ తెలిపారు.

నామినేషన్లు నిల్

అగళి: మండల పరిధిలోని అగళి పంచాయతీలో 2వ వార్డు, పీ బ్యాడగెర పంచాయతీలో 2వ వార్డు సభ్యులకు ఎన్నికకు సంబంధించి బుధవారం నామినేషన్లు రాలేదని ఈఓఆర్డీ పద్మవతి తెలిపారు.

టేక్ హోం రేషన్ అందించండి

పెనుకొండ: అంగన్‌వాడీ కార్యకర్తలు ఇక నుంచి గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ అందజేయాలని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం పెనుకొండ, రొద్దం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీపీఓ సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా 30వ తేదీకి అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ నిల్వ ఉండేలా చూసుకోవాలన్నారు. పాడైన సరుకును వెంటనే వెనక్కి అందజేయాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈరన్న తెలిపారు.

మల్బరీ సాగుతో ఆదాయం

మడకశిరరూరల్: మల్బరీ సాగు పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని సిరికల్చర్ ఆఫీసర్ ప్రతాప్‌నాయక్ రైతులకు సూచించారు. బుధవారం మడకశిర పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో సుంకిరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్ పెట్టుబడి-రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్బరీ సాగు పెంపకం, వ్యాపించే తెగుళ్లు, పట్టు పురుగుల పెంపకం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వాస్పత్రిలో సురక్షిత ప్రసవం

పరిగి: ప్రభుత్వాస్పత్రిలోనే సురక్షితమైన ప్రసవం చేయడం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ నవీన తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో భోజన సదుపాయాన్ని కల్పించారు.

పోలింగ్ బూత్ పరిశీలన

పరిగి: పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ బుధవారం పరిగి మండలంలో పర్యటించారు. తొలుత పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అనంతరం శ్రీరంగరాజుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, ఎమ్మార్సీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం సబ్ కలెక్టర్ కార్తీక్ పరిశీలించారు.

ఎంఈఓకు సన్మానం

అగళి: ఇటీవల బదిలీ అయిన ఎంఈఓ గోపాల్‌ను మండలంలోని ఆర్డీటీ భవనంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రశేఖర్, ఎంఆర్‌పీఎస్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా కేశవరావు

పెనుకొండ: పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా కేశవరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు.

హంతకుడిని శిక్షించాలి

హిందూపురం టౌన్: ఆటో కార్మికుడు దిలావర్‌ను హత్య చేసిన హంతకుడిని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఆటో స్టాండ్ ఉంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ డీటీ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు.

అనారోగ్యంతో డీలర్ మృతి



నరేష్ (ఫైల్)

లేపాక్షి: మండలంలోని కల్లూరుకు చెందిన ఎఫ్‌పీ షాపు డీలరు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎన్.నరేష్ (31) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, అంబికా లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్‌లు వసుంధర, మంజునాథ్ తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నాడు- నేడు పనుల్లో అలసత్వం వద్దు

చిలమత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఎంఈఓ-2 సాల్మాన్‌రాజ్‌కు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కల్లుకుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ నరేష్ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సురేష్‌బాబులతో కలిసి ఆయన పరిశీలించారు. నాడు-నేడుకు పాఠశాల ఎంపికైనా అభివృద్ధి కనిపించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులను ఆదుకోవడంలో కేంద్రం విఫలం

సోమందేపల్లి: రైతులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న ఢిల్లీలో జరగబోయే రైతు సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థి అదృశ్యం



నితిన్‌కుమార్ (ఫైల్)

గుడిబండ: తన కుమారుడు నితిన్‌కుమార్ కనిపించడం లేదని మండల పరిధిలోని రాళ్లపల్లికి చెందిన శ్రీనివాసులు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కదిరేపల్లి సెయింట్‌ఆన్స్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడని, మంగళవారం సాయంత్రం తన స్నేహితుడు వినయ్‌కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి రాలేదన్నారు. వినయ్ కూడా సరైన సమాధానం చెప్పలేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మడకశిరరూరల్: వాతావరణంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం, గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండటం వల్ల మల్బరీ తోటలకు వివిధ రకాల చీడపురుగులు ఆశిస్తున్నాయని పట్టుపరిశ్రమశాఖ ఏడీఏ కే రాజు, సిరికల్చర్ ఆఫీసర్ ప్రతాప్‌నాయక్ తెలిపారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే చీడపురుగులను నివారించవచ్చని బుధవారం వారు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో బ్రాడ్‌మైట్ (పాలీప్యాగోటార్సోనిమస్ లేటెస్) చీడలు మల్బరీ తోటలను ఆశిస్తున్నాయన్నారు.

నివారణకు చర్యలు

- ఈ వ్యాధి ప్రారంభ దశలో చీడల ప్రభావితమైన సుడి రెమ్మలను తొలగించాలి. నివారణకు ఆకు వెనుక భాగంలో నీటితో పిచికారీ చేయలి.
- ఆకు పసర్ల ద్వారా విధి గ్రీన్‌పత్ అనే మందును 2 ఎంఎల్ లీటర్ నీటితో యాడ్ ప్రోఫూటన్ 03 ఎంఎల్ కలిపి రెండు సార్లు పిచికారీ చేయాలి. ఏడు రోజుల తర్వాత మల్బరీ ఆకును పురుగులకు మేతగా వాడవచ్చు.